సాక్షి కుమురం భీం

గురువారం । 13 । జూలై । 2023



బీఆర్ఎస్ నాయకుల ఆందోళనలు
టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు నిరసనలు తెలిపారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. 9లో▸



కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం
టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.1/25.8

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలుచోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ఈటల’ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ఈటల రాజేందర్‌తో మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లో బుధవారం ఆ పార్టీ కుమురం భీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పర్యటించాల్సిందిగా ఈటల రాజేందర్‌ను కోరినట్లు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించడంపై చర్చించినట్లు వివరించారు.

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను రద్దు చేసి వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. వెల్ఫేర్ బోర్డులు పైరవీలకు మాత్రమే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2013లో ఇచ్చిన బాండ్ల డబ్బులను చెల్లించాలని, కార్మికులపై పనిభారం తగ్గించడంతో పాటు మిగిలిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిపో సెక్రెటరీ దివాకర్, నాయకులు బాలునాయక్, ఆనంద్, ఉల్లాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రామకృష్ణ

కెరమెరి(ఆసిఫాబాద్): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తిని అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశవర్కర్లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించాలన్నారు. సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణకు విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించాలని సూచించారు. ఆరోగ్య రక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ప్రత్యేక శిక్షణకు జిల్లా సైన్స్ అధికారి



ప్రయోగాలు చేస్తున్న సైన్స్ అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన, ఆసక్తి పెంచే ఉద్దేశంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ ల్యాబ్‌ల నిర్వహణపై సైన్స్ అధికారులకు శిక్షణ అందించేందుకు రాష్ట్రంలోని నాలుగు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. పూణే సమీపంలోని పాబల్ గ్రామంలో గల విజ్ఞాన ఆశ్రమంలో ఆయా జిల్లాల సైన్స్ అధికారులకు బుధవారం నుంచి నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం జిల్లా నుంచి జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు. సరికొత్త ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



ఈ ఫొటో దహెగాం మండల కేంద్రంలోనిది. ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం వారం రోజులుగా తొలగించడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఇది తిర్యాణి మండలం కుమురంభీం చౌక్‌లో పేరుకుపోయిన చెత్త. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈగలు, దోమలతో ఆదివాసీలకు రోగాల ముప్పు పొంచి ఉంది.



బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివారం వార సంత కావడంతో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. దోమలు, ఈగలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ శారద తాత్కాలిక సిబ్బందితో మంగళవారం పారిశుద్య పనులు చేపట్టారు. అయితే తాము సమ్మెలో ఉండగా పనులెలా చేయిస్తారంటూ గ్రామ పంచాయతీ కార్మికులు పనులను అడ్డుకున్నారు. చివరికి పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.



“ ఇది జిల్లా కేంద్రంలోని 12వ వార్డు. కొన్నిరోజులు చెత్త సేకరణ వాహనం రాకపోవడంతో వార్డులో కొంతమంది చెత్తను ఇలా రోడ్డుపైనే పారబోస్తున్నారు. వర్షానికి దుర్గంధం వెదజల్లుతుండటంతో రోడ్డువెంట వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ‘దయచేసి ఇచ్చట చెత్త వేయరాదు’ అని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన చోటే గుట్టలుగా చెత్త పేరుకుపోవడం గమనార్హం. ”

- పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుధ్య పనులకు ఆటంకం
- వారం రోజులుగా గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వర్షాలకు కంపు కొడుతున్న గ్రామాలు
- వ్యాధుల ముప్పుతో ఆదివాసీల్లో ఆందోళన

ఆసిఫాబాద్: పంచాయతీ కార్మికుల సమ్మెతో జిల్లాలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీనికితోడు రెండు రోజులుగా పలుచోట్ల వర్షం పడుతుండటంతో చెత్తాచెదారం పేరుకుపోయి పల్లెలు కంపుకొడుతున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా కేంద్రంతోపాటు గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.

సమ్మెలో జీపీ కార్మికులు..
జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో గల 1,100 గ్రామాల్లో సుమారు వెయ్యి మందికి పైగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 750 మంది తాత్కాలిక సిబ్బంది ఉన్నారు. ముందుగా సమ్మె నోటీసు ఇచ్చిన కార్మికులు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారు. పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో పాటు ఇతర విధులు నిర్వహించే సిబ్బంది విధుల్లో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం వరకు పంచాయతీ కార్మికులకు నెలకు రూ.8,500 చెల్లించగా, ప్రస్తుతం రూ.9,500 చెల్లిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నిలిచిన చెత్త సేకరణ
పంచాయతీ కార్మికులు సమ్మెలోకి వెళ్లినా ఇప్పటివరకు అధికారులు అనేక చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రంలో ప్రతిరోజూ చెత్త సేకరించే వాహనాలు నిలిచిపోయాయి. చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో కొంతమంది నిర్లక్ష్యంగా రోడ్లపైనే చెత్తాచెదారం పడేస్తున్నారు. డ్రెయినేజీలు పూడిక నిండి కంపు కొడుతున్నాయి. ఏజెన్సీ గ్రామాల్లో సురక్షిత తాగునీరు అందడం లేదు. పారిశుధ్య పనులు కూడా చేపట్టకపోవడంతో గిరిజనులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



దశాబ్దాలుగా పంచాయతీ కార్మికులుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం విడతల వారీగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళనలు చేపడుతున్నాం. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి. – చునార్కర్ శంకర్, జీపీ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం

పంచాయతీ కార్మికుల సమ్మె నేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు గ్రామ పంచాయతీల్లో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక సిబ్బందిని విధులకు తీసుకున్నాం. తాగునీరు, ఎలక్ట్రికల్, ఇతర అత్యవసర పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రజలు ఆందోళన చెందవద్దు. – సురేందర్, ఇన్‌చార్జి డీపీవో

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్: ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు డప్పుచప్పుళ్ల మధ్య అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్, బీజేపీ నాయకులు ఆత్మారాంనాయక్, జయరాజ్, కిషోర్ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్, నాయకులు శ్రీనివాస్, రాజేందర్, శంకర్, నగేశ్, రాజు, ప్రభాకర్, మోతీరాం, సంతోష్, శ్రీకాంత్, సమ్మయ్య పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఎదుట ఎండీఎం కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. నూతనంగా అమలు చేస్తున్న మెనూకు బడ్జెట్ పెంచాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు మాయ, ప్రధాన కార్యదర్శి శారద, నాయకులు రజిత, పార్వతి, లలిత, కాంతమ్మ, సీఐటీయూ నాయకులు లోకేష్, ఆనంద్, కృష్ణమాచారి, రాజేందర్, ఓదేలు, నగేశ్ ఉన్నారు.

గెలిపించండి.. రుణం తీర్చుకుంటా

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సిర్పూర్(టి): గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన.. పెద్దగుట్ట పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ గ్రామ ప్రజలను స్థానిక ఎమ్మెల్యే అక్రమ కలప రవాణాకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మాలిని నుంచి వాంకిడికి రోడ్డు నిర్మించి, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

బీఆర్ఎస్ విఫలం..
సిర్పూర్(టి): రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చీలపెల్లి, పూసిగూడ, మేడిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పూసిగూడ గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారని అన్నారు. బీఎస్పీని గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సరిపడా ఆహార సామగ్రి సరఫరా చేయకపోవడంతో విద్యార్థులను ఇంటికి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్, అధికార ప్రతినిధి సంజయ్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నాయకులు అర్షద్‌హుస్సేన్, దుర్గం ప్రవీణ్, నవీన్, చాంద్ పాషా, మనోహర్, విజయ నిర్మల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిరుపతి, చిరంజీవి, కార్తీక్, దినకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. వసతిగృహాలు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ పోస్టులను భర్తీ చేసి, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలన్నారు. అనంతరం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డీఆర్‌వో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు.

‘ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్’



మాట్లాడుతున్న సత్యనారాయణ

బెజ్జూర్: హామీలు అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ ప్రాజెక్టు వరద కారణంగా దహెగాం, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, బెజ్జూర్ మండలాల్లో రైతులు పంట నష్టపోయినా ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు వెంకటేశం, బాలకృష్ణ, ఆత్రం రామయ్య, టి.రామయ్య, వసీఉల్లా ఖాన్ పాల్గొన్నారు.

వీఆర్ఏలకు ఊరట

- నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు
- వివిధ శాఖల్లో సర్దుబాటుకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 1,991 మందికి లబ్ధి

జిల్లా	పని చేస్తున్న వీఆర్ఏలు
ఆదిలాబాద్	392
మంచిర్యాల	542
నిర్మల్	740
కుమురంభీం	317
మొత్తం	1,991



డిమాండ్లు నెరవేర్చాలని మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న వీఆర్ఏలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎట్టకేలకు గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ)కు పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్న 1,991మంది వీఆర్ఏలకు భారీ ఊరట కలిగింది. తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ గత జూలై 25నుంచి అక్టోబర్ 13వరకు మొత్తంగా 83రోజులపాటు సమ్మెలో పాల్గొన్నారు. అప్పట్లో ప్రభుత్వం స్పందించకపోవడంతో తిరిగి విధుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ వీఆర్ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని ప్రకటించారు. తాజాగా వారం రోజుల్లో వీఆర్ఏల విద్యార్హతను బట్టి 11 ప్రభుత్వ శాఖలకు కేటాయించేందుకు కసరత్తు సాగుతోంది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. వీఆర్ఏ జేఏసీ ప్రతినిధులతో రెండు రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న వారందరికీ ప్రస్తుతం పొందుతున్న గౌరవ వేతనం రూ.11,500 నుంచి నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తే రెట్టింపు జీతం పొందే అవకాశం ఉంది. ఏళ్లుగా గ్రామాల్లో వారసత్వంగా సుంకరి, ఇతర స్థాయిలో పని చేస్తూ గ్రామ సేవకులుగా కొనసాగుతున్న వారికి ఎటువంటి విద్యార్హతలు లేవు. దీంతో వీరిని కూడా నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఆ తరువాత కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎన్నికైన వారు కూడా ఉన్నారు. ఇందులో కనీస అర్హత పది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చేసిన ఉన్నత విద్యావంతులు కూడా ఉన్నారు. వీరిని కూడా విద్యార్హతలను బట్టి వివిధ హోదాల్లో కేటాయిస్తే ఉన్నత అర్హతలు ఉన్న వారికి కూడా వేర్వేరు స్థాయిల్లో గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఎలాంటి అర్హత లేని వారు, ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న వారు, వారి వారసులను కారుణ్యం కింద ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్లు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్హతలనే ప్రామాణికంగా తీసుకునే యోచన ఉండడంతో ఎటువంటి విద్యార్హతలు లేని వారిని ఎలా సర్దుబాటు చేస్తారనే దానిపైన మంత్రివర్గ ఉప సంఘం వీఆర్ఏ జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది.

ఉమ్మడి జిల్లాలో..
రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రక్షాళనలో భాగంగా విలేజ్ రెవెన్యూ ఆఫీసర్(వీఆర్వో) వ్యవస్థను రద్దు చేసింది. దీంతో వీఆర్వోలకు కింది స్థాయిలో పని చేసే వీఆర్ఏలకు పదోన్నతి, జాబ్ చార్టర్ లేక ఉన్నతాధికారులు చెప్పినట్లుగా గత కొంత కాలంగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. భూ సంబంధిత వ్యవహారాలు తప్పా మిగతా పనులు గ్రామాల్లో ఉండే రోజువారి కార్యక్రమాలు ఉన్నతాధికారుల పర్యటనలో ప్రొటోకాల్ విధులు, పౌర సరఫరాల శాఖ సంబంధించిన విధులు, ధాన్యం కొనుగోలు, అమ్మకాలు తదితర విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దు తరువాత కచ్చితమైన జాబ్‌చార్టర్ లేక స్థానిక తహసీల్దార్ల ఆదేశాలతోనే గ్రామాల్లో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వీఆర్ఏలు అందరికీ భారీ ఊరట కలిగిస్తోంది.

త్వరగా పూర్తి చేయాలి



ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి కచ్చితమైన జాబ్‌చార్టర్ లేక కేవలం గౌరవ వేతనంతోనే పని చేస్తున్న వీఆర్ఏలను వివిధ ప్రభుత్వ శాఖల్లోకి వెంటనే సర్దుబాటు చేయాలి. ఉద్యోగుల అర్హతను బట్టి విధులు కేటాయించాలి. సమ్మెలో పేర్కొన్న డిమాండ్లను నేరవేర్చాలి. – దుర్గం శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా, వీఆర్ఏ జేఏసీ కన్వీనర్

జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలను జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురుకుల ఆర్సీవో గోపిచంద్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బీసీ డిగ్రీ గురుకుల కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, నాగరాజు, గడ్డల ప్రణయ్, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

జైపూర్ ఏసీపీగా మోహన్


బలుసాని మోహన్


గోపతి నరేందర్

జైపూర్: జైపూర్ ఏసీపీగా బలుసాని మోహన్ నియామకం అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 26మంది డీఎస్పీలు బుధవారం బదిలీ అయ్యారు. ఇక్కడ ఏసీపీగా పని చేస్తున్న గోపతి నరేందర్‌ను కరీంనగర్ రూరల్‌కు బదిలీ చేశారు. రామగుండం కమిషనరేట్ ఎస్‌బీలో ఏసీపీగా పని చేస్తున్న మోహన్ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. కాగా, మూడున్నరేళ్లకు పైగా ఇక్కడ పని చేసిన నరేందర్ తన విధి నిర్వహణతో ప్రజల్లో చెరగని ముద్రవేశారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ఫ్రెండ్లీ పోలీసులుగా ప్రజలకు నిత్యం సేవలందించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

భీమారం: నెన్నెల మండలం చామన్‌పల్లి నుంచి చెన్నూరు మండలం సుద్దాల గ్రామానికి అక్రమంగా బైక్‌పై గుడుంబా తరలిస్తున్న బుక్యా చంద్రశేఖర్ అనే వ్యక్తిని బుధవారం మండలంలోని కాజీపల్లి సమీపంలో ఎక్సైజ్ శాఖ ఎస్సై జీవన్ రెడ్డితోపాటు సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి నుంచి 8 లీటర్ల గుడుంబాతో పాటు బైక్ స్వాధీనం చేసుకున్నట్లు మంచిర్యాల ఎక్సైజ్ శాఖ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. సిబ్బంది రాజేంద్రప్రసాద్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

పెంచికల్‌పేట్: మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన జాడి నారాయణ వద్ద 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగిపై కత్తితో దాడి


దేవయ్య(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కత్తి దాడిలో గాయపడిన లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన చిలుక దేవయ్య (49) చికిత్స పొందుతూ వరంగల్‌లోని ఎంజీఎంలో బుధవారం మృతి చెందాడు. సీఐ రాజు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇటిక్యాలకు చెందిన చిలుక దేవయ్య అనారోగ్యంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. దేవయ్య పక్క బెడ్డుపై స్థానిక కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్న మహా రాష్ట్రకు చెందిన గాదె సుధాకర్ చికిత్స పొందుతున్నారు. ఈ నెల 10న అర్ధరాత్రి సుధాకర్ కత్తితో దేవయ్యపై దాడి చేసి గాయపర్చాడు. దేవయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో దేవయ్య బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు రాంకి ఉన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

రెబ్బెన: మండల కేంద్రంలోని రేషన్ దుకాణం (2409004)లో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఆర్ఐ ప్రేమ్‌కుమార్‌లు తనిఖీ నిర్వహించారు. రేషన్ డీలర్ బియ్యానికి బదులు డబ్బులు పంచుతూ పట్టుబడడంతో 6ఏ కేసు నమోదు చేశారు. దుకాణానికి కేటాయించిన నిల్వలను తనిఖీ చేయగా 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. లబ్ధిదారులకు పంచుతున్న రూ.4870, ఈపాస్ యంత్రం సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

సాగు తగ్గే.. ధర పెరిగే

- జిల్లాలో పప్పుధాన్యాల సాగు అంతంతే..
- చుక్కలనంటుతున్న ధరలు

గతేడాది జిల్లాలో సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	వానాకాలం	యాసంగి
వరి	1,57,593	1,03,349
పత్తి	1,58,145	163
కంది	2,325	225
పెసర	45	352
మినుము	05	71



దండేపల్లి(మంచిర్యాల): జిల్లాలో పప్పుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో పప్పుల ధరలు చుక్కలనంటుతున్నాయి. పప్పుల ధరలు చూస్తే సామాన్యుడు పప్పన్నం కూడా తినలేని పరిస్థితి నెలకొంది. నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో పాటు ప్రభుత్వం వరికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చాలా మంది రైతులు వరిసాగుపై మొగ్గు చూపుతున్నారు. అంతే కాకుండా పత్తి, మిర్చి పంటలకు ఆశించిన ధరలు లభిస్తుండడంతో వాటిపై కూడా చాలా మంది దృష్టి సారిస్తున్నారు. పప్పు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించక పోవడంతో సాగు అంతంత మాత్రంగానే ఉంటోంది. పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గడంతో వాటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

కారణాలు అనేకం..

వానాకాలంలో మెట్ట ప్రాంతాల్లో కంది, పెసర పంటలు సాగు చేస్తే కొంతమేర నష్టపోవాల్సిన పరిస్థితులు. వేసవిలో సాగు చేస్తే ఎండల కారణంగా, అకాల వర్షాలతో పంటలు చేతికి రావడంలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ఈ కారణంగా కూడా రైతులు పప్పుధాన్యాల సాగుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అన్నింటినీ తట్టుకుని పప్పుధాన్యాలు పండించినా పంటను అమ్ముకునేందుకు రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు లేకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. పప్పు ధాన్యాలు ఎక్కువగా వర్షాధారంతో పండించవచ్చు. కానీ వీటికి చెల్క నేలలు అనుకూలంగా ఉన్నప్పటికీ చెల్కనేలల్లో రైతులు పత్తిసాగు ఎక్కువగా చేస్తున్నారు.

సాగు అంతంత మాత్రమే..

జిల్లాలో గతేడాది వానాకాలం, యాసంగి పంట సాగు వివరాలను పరిశీలిస్తే అందులో వరి, పత్తి, పంటలు అధిక విస్తీర్ణంలో సాగుకాగా పప్పు ధాన్యాల సాగు మాత్రం చాలా తక్కువ విస్తీర్ణంలో ఉంది. వ్యవసాయ అధికారులు పంటల సాగుపై అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రైతులు, వరి, పత్తి, పంటల వైపే మొగ్గు చూపిస్తున్నారు. వరి, పత్తితో పాటు పప్పు ధాన్యాలు కూడా పండించాలని, వాటికి ఆశించిన స్థాయిలో ధర లభిస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పినా రైతులు అటుగా దృష్టి సారించకపోవడం గమనార్హం.

మద్దతుధర పెంపుతో సాగు పెరిగేనా?

గత సీజన్‌తో పోలిస్తే పప్పు ధాన్యాలకు మద్దతు ధరలు భారీగా పెరిగాయి. గతేడాది పెసరపంట క్వింటాలుకు రూ.7,755 ఉండగా ఈ ఏడాది రూ.8,858 కి పెరిగింది. కందికి మద్దతు ధర రూ.7వేలకు చేరింది. మద్దతు ధర పెంపుతో నైనా జిల్లాలో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతుందేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరి, పత్తితో పాటు పప్పు ధాన్యాల సాగుపై కూడా దృష్టి సారించాలని సూచిస్తున్నాం. పత్తిలో అంతర పంటగా కంది, కందిలో పెసర, మినుము పంటలుగా సాగు చేసుకోవచ్చని సూచిస్తున్నాం. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా రైతుల్లో మరింత అవగాహన కల్పిస్తాం.

– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

విద్యుత్‌షాక్‌తో యువకుడికి గాయాలు


గాయపడిన ఆత్రం అన్నిగా

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యుత్‌షాక్‌తో స్తంభంపై నుంచి పడి యువకుడు గాయపడిన ఘటన బుధవారం వాంకిడి మండలం ఖానాపూర్‌లో చోటుచేసుకుంది. సర్పంచ్ సిడాం అన్నిగా తెలిపిన వివరాల ప్రకారం.. చౌపన్‌గూడ పంచాయతీ పరిధిలో విద్యుత్ పనులు నిర్వహించేందుకు ఆత్రం అన్నిగా అనే యువకుడిని తాత్కాలిక పద్ధతిలో నియమించుకున్నారు. ఈ క్రమంలో అతడు బుధవారం వీధి దీపాలు అమర్చడం, ఇతర పనుల కోసం పంచాయతీ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి వెళ్లాడు. సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ వచ్చేవరకు స్తంభం ఎక్కొద్దని, లైన్ క్లియర్ ఇచ్చాక ఫోన్ చేసి చెబుతానని సర్పంచ్ చెప్పి పంపించారు. కానీ ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ లేకపోవడాన్ని గమనించిన అన్నిగా.. సర్పంచ్ నుంచి ఫోన్ రాకుండానే స్తంభంపైకి ఎక్కాడు. స్తంభంపై విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి కిందపడ్డాడు. విద్యుదాఘాతంతో రెండు చేతులు కాలిపోగా, కిందపడటంతో కాలు విరిగింది. బాధితుడిని మొదట ఆసిఫాబాద్ ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటించాలి

- సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎం గుప్తా


మాట్లాడుతున్న గుప్తా

శ్రీరాంపూర్: ఉద్యోగులు విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎం గుప్తా తెలిపారు. రక్షణపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై 'నా భద్రత–నా బాధ్యత, నా భద్రతే –నా కుటుంబ భద్రత' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి స్వీయ రక్షణతో పని చేయాలన్నారు. తద్వారా తన కుటుంబం కూడా సురక్షితంగా ఉంటుందన్నారు. విధి నిర్వహణలో రక్షణ పరికరాలను ధరించాలని సూచించారు. ఎస్మోపీలో పేర్కొన్న విధంగా విధులు నిర్వహించాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి కంపెనీకి శ్రేయస్కరమన్నారు. జీరో ప్రమాదాల సింగరేణిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు శర్మ, రామనాథం, ఇన్‌చార్జి ఓసీపీ అధికారి ఎం శ్రీనివాస్, మేనేజర్ సుధీర్, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, ప్రాజెక్టు ఇంజినీర్ చంద్రశేఖర్, పిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య, రక్షణాధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు, సంక్షేమాధికారి బొంగుని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత బెల్లంపల్లి బ్లూటీం


బహుమతులతో క్రీడాకారులు

బెల్లంపల్లి: పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బెల్లంపల్లి బ్లూటీమ్ విజేతగా నిలిచింది. గురు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన క్రికెట్ పోటీల్లో బెల్లంపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లార్షా జట్లు పాల్గొన్నాయి. ఉత్సాహ పూరిత వాతావరణంలో క్రీడాకారులు క్రికెట్ ఆడి రంజింప చేశారు. ఫైనల్ మ్యాచ్ బెల్లంపల్లి–మంచిర్యాల జట్ల మధ్య సాగింది. రెండు జట్లు సమఉజ్జీలుగా ఆడగా చివరికి బెల్లంపల్లి బ్లూటీమ్ విన్నర్స్‌గా, మంచిర్యాల టీమ్ రన్నర్స్‌గా నిలిచాయి. ఉత్తమ బౌలర్స్‌గా సాహిల్ యాదవ్, వినయ్ వర్ధన్, ఉత్తమ బ్యాట్‌మెన్‌గా కుందన్, ఉత్తమ ఆల్‌రౌండర్‌గా పవనసుత రాణించారు. గురు అకాడమీకి కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు ఎండి అఫ్జల్, లక్ష్మణ్, వెంకట్, సిలివేరి సత్యనారాయణ, సమ్మిరెడ్డి, మొండి, సాయికిరణ్ యాదవ్, పాల్గొన్నారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నస్పూర్: విధుల్లో మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గడిచిన పది రోజుల్లో బెల్లంపల్లి మండలం చిన్నబూద గ్రామంలో ప్రశాంత్, దండెపల్లి మండలం రాజంపేట గ్రామంలో గంగాధరి మల్లేశ్ అనే ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్స్ విధుల్లో ఉన్నప్పుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందారన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్నన్న, ఉపాధ్యక్షుడు సంపత్, సీనియర్ నాయకులు రాయలింగు, జగన్, రవి తదితరులు పాల్గొన్నారు.

పీవోను కలిసిన కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్


పీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోవ లక్ష్మి

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ని కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి బుధవారం ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. రంజిత్‌కుమార్ మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, దాగం రాజారాంలతో కలిసి మాట్లాడుతూ పెరిగిన వేతనాలు చెల్లించాలని, మెనూ చార్జీలు పెంచాలన్నారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే జూలై 14 తర్వాత సమ్మె చేస్తామని తెలిపారు. సహాయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బుచ్చన్న, కాంతమ్మ, పద్మ, అంజలి, లక్ష్మి, గట్టమ భాగ్య, ఫరియా, పోసక్క ఉన్నారు.

బడిలో గోబర్‌గ్యాస్ ప్లాంటు

- ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు
- పర్యావరణ సమతుల్యతే లక్ష్యంగా..
- తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తికి చర్యలు


దేవునిగూడ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గోబర్‌గ్యాస్ ప్లాంట్

పాతమంచిర్యాల: సురక్షితమైన పద్ధతులతో, పర్యావరణానికి హాని తలపెట్టకుండా మనకు లభించే వనరులతో తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గోబర్‌గ్యాస్(బయోగ్యాస్) ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ముందుగా పశువుల పేడ అందుబాటులో ఉండే పాఠశాలలు, నిర్మాణానికి అనువైన స్థలం అందుబాటులో ఉన్న పాఠశాలల్లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్యాస్ సిలిండర్లు, వంట చెరుకు కొనుగోలు ఖర్చులు ఆదా అవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని జన్నారం మండలం దేవునిగూడెం, చెన్నూరు మండలంలోని కిష్టంపేటలో గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.70 నుంచి రూ.80 వేల వరకు ఖర్చు చేయనున్నారు.

గ్యాస్ ఉత్పత్తి ఇలా..

ముందుగా ప్లాంట్‌లో పశువుల పేడను వేస్తే అది కుళ్లిపోయిన తర్వాత గ్యాస్ ఉత్పత్తి కావడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. ఆ తర్వాత ప్రతీరోజు ప్లాంట్‌లో రెండు నుంచి మూడు తట్టల పేడ వేస్తే గ్యాస్ ఉత్పత్తి జరుగుతుంది. రోజుకు 40 నుంచి 50 మందికి వంట చేయడానికి సరిపడా గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ప్లాంట్‌లో పేడను వేసే బాధ్యతను గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించనున్నారు. గతంలో గృహావసరాల కోసం గ్రామాల్లో గోబర్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇంటి యజమానులకు నగదు చెల్లించింది. కొద్దిరోజుల పాటు బయోగ్యాస్ వినియోగం జరిగినా కాలక్రమేణా తగ్గిపోయింది. గ్యాస్ సిలిండర్ల రాకతో గోబర్‌గ్యాస్‌పై ప్రజలకు ఆసక్తి తగ్గిపోయింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గోబర్ గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బయోగ్యాస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనకు వస్తున్న కేంద్ర బృందం సభ్యులు ఈ నెల 15 నుంచి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ, అమలు పరిశీలన చేయనున్నారు. ఇందులో భాగంగా గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణాలను కూడా పరిశీలిస్తారు.

తక్కువ ఖర్చుతో..



సురక్షితమైన పద్ధతులతో వంట చేసుకోవడమే కాకుండా పర్యావరణానికి హాని తలపెట్టకుండా మనకు లభించే వనరులతో తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశువుల పేడ అందుబాటులో ఉండే పాఠశాలలు, అనువైన స్థలం ఉన్న పాఠశాలల్లో ప్లాంట్ నిర్మించనున్నాం. జిల్లాలో రెండు చోట్ల గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోంది.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని వినతి

శ్రీరాంపూర్: మైన్స్, సేఫ్టీ, టెంపుల్ కమిటీల్లో తమకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ సంఘాల నాయకులు బుధవారం గని ఎస్సార్పీ1 మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసినందున డైరెక్టర్(పా)ఆదేశాల మేరకు అన్ని సంఘాలను సమానంగా చూడాలన్నారు. సీఐటీయూ నాయకులు తోడ సుధాకర్, పెండ్యాల బాలకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు మోత్కూరు కొమురయ్య, దాడి రాజయ్య, ఐఎన్టీయూసీ నాయకులు వెంకటేష్, అనిల్, బీఎంఎస్ నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మెగా కంపెనీ సామగ్రి చోరీ

నెన్నెల: ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనులు చేపడుతున్న మెగా ఇంజినీరింగ్ కంపెనీ మైలారం క్యాంపులో బుధవారం సాయంత్రం కొమ్ము రాజేష్ చోరీకి పాల్పడ్డాడని నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. టాటా ఏస్ వాహనంలో వచ్చి సెక్యూరిటీ గార్డ్‌ను బెదిరించి నాలుగు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, ఒక ఆక్సిజన్ సిలిండర్, ఒక ప్లాస్టిక్ డ్రమ్‌ను తీసుకెళ్లాడని పేర్కొన్నారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ.30 వేలు ఉంటుందని, సెక్యూరిటీ గార్డు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వ్యక్తి అదృశ్యం

బెల్లంపల్లి: బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన చెన్న సతీష్ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. ఈ నెల 10న రాత్రి జమ్మికుంట మండలం కనగర్తి గ్రామంలో ఉన్న తన భార్య వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడని తెలిపారు. ఎక్కడ ఉన్నాడో సమాచారం తెలియరాలేదని, సతీష్ తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్: జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(ఇండియా) స్కాలర్‌షిప్‌లకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జేసీఐ జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ల రాజు తెలిపారు. 9వ నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రతీ సంవత్సరం రూ.3000 స్కాలర్‌షిప్‌ను అందిస్తామని తెలిపారు. పాఠశాల, కాలేజీ పేద విద్యార్థులను గుర్తించి దరఖాస్తులు అందించాలని కోరారు. ఈ నెల 28లోగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని, వివరాల కోసం 99855 12134 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ


తెరిచి ఉన్న బీరువా

బెల్లంపల్లి: పట్టణ శివారులోని బుధాకలాన్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సాయిబాబా ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడిలోని బాబా విగ్రహం పక్కన ఉన్న బీరువా తాళం పగులగొట్టి రూ.60 వేల విలువైన పంచలోహ విగ్రహం, వెండి కిరీటం, రూ.2వేల నగదు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన నిర్వాహకులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్, బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా అనుమానితులపై అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

టేకులబస్తీలో..

టేకులబస్తీలో ఉన్న మసీదుదర్గాలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. దర్గాలోని రెండు పెట్టెల్లో భద్రపర్చిన రూ.55వేల నగదు, ఐదు తులాల వెండి కడ్డీని పట్టుకెళ్లారని వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు. నిర్వాహకుడు కొండి కొప్పుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గూడు చెదిరింది.. కన్నీరే మిగిలింది

- వర్షానికి దెబ్బతిన్న ఇల్లు..
- అంధురాలైన కుమార్తెతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న అనసూర్య


దెబ్బతిన్న ఇంటి వద్ద కుమార్తెతో అనసూర్య

వేమనపల్లి: అంధురాలైన కుమార్తెతో.. అనారోగ్య సమస్యలతో కాలం వెల్లదీస్తున్న ఆ తల్లిపై ప్రకృతి పగబట్టింది. జోరువానకు మంగళవారం తెల్లవారు జామున ఇంటి గోడలు ఒక్కసారిగా కూలిపోయాయి. ఉండేందుకు ఇల్లు లేక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వేమనపల్లి దస్నాపూర్ గ్రామానికి చెందిన గరివందల అనసూర్య భర్త లింగాగౌడ్ 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడగా, అంధురాలైన కుమార్తె ఎంకమ్మతో కలిసి ఉంటోంది. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ డబ్బులతోనే కాలం వెల్లదీస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షాలకు ఇంటి గోడలు ఒక్కసారి కూలడంతో గూడు లేకుండా పోయింది. దాతలు స్పందించి సాయం అందించాలని కన్నీటితో వేడుకుంటున్నారు. దాతలు 95428 37467(వేకూరి గోపాల్) నంబర్‌కు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

కాసిపేట: కాంట్రాక్ట్ కార్మికుల సమస్య పరిష్కారమయ్యే వరకు వెంట ఉండి పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా కేకే ఓసీలో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఆర్‌వీఆర్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఒప్పిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న చర్చలు

కార్మికుల సమస్యలపై రామగుండం సీపీ రెమా రాజేశ్వరి వద్ద చర్చలు కొనసాగుతున్నాయి. మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయంలో ఏసీపీ సదయ్య, డైరెక్టర్ పీపీ సింగరేణి వెంకటేశ్వర్‌రెడ్డి తోపాటు జీఎం మోహన్‌రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థ యజమానితో జరిపిన చర్చలు కొలిక్కి రాకపోవడంతో బుధవారం సాయంత్రం సీపీ వద్ద చర్చలకు కార్మికులు, పోలీసు అధికారులు, సింగరేణి అధికారులు వెళ్లారు. చర్చలు పూర్తయితే సమాచారం తెలియనుంది.